



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహిద్దాం

- నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి
- అధికారులకు ఎన్నికల పరిశీలకుల సూచన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులందరూ సమిష్టిగా పని చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎం.హరి జవహర్ లాల్, డా॥పోలా భాస్కర్ సూచించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శాసనమండలి ఎన్నికల పోలింగ్ సన్నద్ధతపై జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్‌తో కలిసి నోడల్ అధికారులతో బుధవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు ఎం.హరి జవహర్‌లాల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచా చెప్పకుండా పాటించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ని పకడ్బందీగా, పక్కాగా అమలు చేయాలన్నారు. వేసవి దష్ట్యా పోలింగ్ కేంద్రాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈనెల 13వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే పోలింగ్ సజావుగా జరిగేలా చూసుకోవాలన్నారు. పోలింగ్ కోసం సిద్ధం చేసే బ్యాలెట్ పేపర్ పై ప్రత్యేక దష్టి పెట్టాలని, అభ్యర్థుల పేర్లు, ఫోటోలు సక్రమంగా ఉన్నాయా లేదా అనేది పరిశీలించాలన్నారు. ఎన్నికలను మానిటర్ చేసేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు కూడా చాలా ముఖ్యమన్నారు. ఎన్నికల నేపథ్యంలో వస్తున్న ఫిర్యాదులపై వెంటనే పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టభద్రుల స్థానం ఎన్నికల పరిశీలకులు డా॥పోలా భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో ఎన్నికల అధికారులు బాధ్యతగా నడుచుకోవాలన్నారు. కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం ప్రణాళిక ప్రకారం ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలింగ్ నిర్వహించేలా చూసుకోవాలని తెలిపారు. ఈనెల 10వ తేదీన ఇచ్చే శిక్షణ తరగతుల్లో బ్యాలెట్ పేపర్‌పై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన వివిధ రకాల టీంలు నిరంతరం అప్రమత్తంగా పని చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టీఎస్.చేతన్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులంతా జాగ్రత్తగా పని చేయాలన్నారు. ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన బందోబస్తు వివరాలను వివరించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వదద పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, సిపిఒ విజయకుమార్, డీఆర్డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, హౌసింగ్ పీడీ చంద్రమోహన్ రెడ్డి, ఆర్డీవోలు తిప్పేనాయక్, రాఘవేంద్ర, అడిషనల్ ఎస్పీ కెవిఆర్‌కె ప్రసాద్, డిసిఒ కష్ణ నాయక్, డిపిఒ విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం పోరాటం



సదస్సులో మాట్లాడుతున్న కేరళ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పికె.శ్రీమతి

- యువత ఉద్యమాల్లోకి రావాలి
- మనువాదంతో మహిళకు సంకెళ్లు
- కేరళ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి పికె.శ్రీమతి
- అనంతలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పేపర్లకే పరిమితం అవుతున్న మహిళల హక్కుల కోసం ఐక్య పోరాటాలే మార్గమని, దీనికి కోసం యువత ముందుకు రావాలని కేరళ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పికె.శ్రీమతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని టిటిడి కళ్యాణమంటపంలో ఐద్వా, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఆశా, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు, సిఐటియు, ఎండిఎం ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. 'సమానతను సాధించుకుందాం–ఉద్యమాలను బలపరుచుకుందాం' అన్న అంశంపై ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అధ్యక్షత సదస్సు కొనసాగింది. ఈ కార్యక్రమానికి పికె.శ్రీమతి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంతర్జాతీయంగా మహిళల పోరాట ఫలితంగా హక్కులు సాధించుకున్నారని తెలిపారు. 1910వ సంవత్సరంలో కొపెన్‌హాగన్‌లో జరిగిన సదస్సులో మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయం జరిగిందని తెలిపారు. 1975లో ఐక్యరాజ్యసమితి కూడా అధికారికంగా మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. దీన్ని ఒక ఉత్సవంగా కాకుండా పోరాట స్ఫూర్తిగా తీసుకోవాల్సి ఉందన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించబడుతున్నట్టు చెబుతున్నా సోషలిస్టు ప్రభుత్వాలున్న చోట తప్ప తక్కిన ఎక్కడా అమలు జరగలేదన్నారు. అఫ్ఘనిస్తాన్ వంటి పాసిస్టు ప్రభుత్వాలున్న చోట మహిళలపై మరింత వివక్ష, అణచివేత కొనసాగుతోందన్నారు. ఇదే పాసిస్టు భావాలున్న ప్రభుత్వం భారతదేశంలో బిజెపి రూపంలో అధికారంలో ఉందని ఉద్ఘాటించారు. దేశంలో మనుసంస్కృతిని అమలు చేయాలని ఆ ప్రభుత్వం ఇక్కడా చూస్తోందని పేర్కొన్నారు. మనుధర్మవరం ప్రకారం మహిళలకు ఎటువంటి హక్కులూ లభించవని తెలిపారు. ఇప్పటికే దేశంలో మైనార్టీలు, దళితులపై దాడులు పెరుగుతున్నాయని గుర్తుచేశారు. ఇందులో ఆ వర్గాల మహిళలు మరింత ఎక్కువగా బాధించబడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇది రాబోయే రోజుల్లో మెజార్టీగానున్న హిందూ మహిళలపైనా జరుగుతుందని హెచ్చరించారు. అందుకే మతతత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో ఇక్కడున్న మహిళలు రావడమే కాకుండా యువత కూడా రావాలని పిలుపునిచ్చారు.

మహిళా హక్కుల కోసం పురుషులూ పోరాడాలి : ఎండ్లూరి

మహిళా హక్కుల కోసం మహిళలే కాకుండా పురుషులు కూడా పోరాటం సాగించాలని ప్రముఖ మానసిక వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్ పేర్కొన్నారు. మహిళలకు సమస్య వచ్చినప్పుడు మాత్రమే ఐక్యత కాకుండా అన్ని సందర్భాల్లోనూ వారికి అండగా నిలవాలన్నారు. మహిళల హక్కుల రక్షణ ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ఆడపిల్ల పుడుతోందంటూ పురిట్లోనే చంపేసే సంస్కృతి ఇటీవల పెరుగుతోందన్నారు. దీన్ని మహిళలే అరికట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. రెడ్స్ స్వచ్ఛందసంస్థ ప్రతినిధి భానుజ మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలున్నా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయని పేర్కొన్నారు. వాటి అమలు కోసమూ పోరాటాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోందని చెప్పారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించాలన్నారు. మహిళా దినోత్సవం స్ఫూర్తితో సమానత సాధనకు ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుత ప్రభుత్వాల పాలనలో మహిళల హక్కుల హరింపు
పశ్చిమ రాయలసీమ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రస్తుత ప్రభుత్వాల పాలనలో రాజ్యాంగ ఉల్లంఘనతో పాటు మహిళల హక్కుల ఉల్లంఘన కొనసాగుతోందని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. మనుధర్మం పేరుతో వారి హక్కులను హరించే సంస్కృతికి స్వస్తి పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, యమున, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు, రమణయ్య, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జెవివి నాయకురాలు డా॥ప్రసూన, డా॥ప్రగతి, డా॥విజయపద్మ, యోగా మాస్టర్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పికె.శ్రీమతి

ఆడపిల్లల్ని బతకనిద్దాం.. ఎదగనిద్దాం బ్రోచర్‌లు ఆవిష్కరణ

భ్రూణ హత్యలు నివారించి ఆడపిల్లలకు బతుకునిచ్చి.. చదువునిచ్చి.. సమాజంలో అత్యున్నత స్థానాలకు ఎదిగేలా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఐద్వా అఖిల భారత అధ్యక్షురాలు పికె.శ్రీమతి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన ఆడపిల్లల్ని బతుకనిద్దాం–చదువనిద్దాం– ఎదుగనిద్దాం అనే బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఆడ, మగ వత్యాసం, వివక్ష లేకుండా మహిళల్ని గౌరవించాలన్నారు.



నాట్యం చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న ప్రదర్శనలు

మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సు సందర్భంగా నాట్య శిక్షకురాలు సంధ్యామూర్తి శిష్యబృందం ఆధ్వర్యంలో చేపట్టిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇదే సమయంలో యువతులు కర్రసాము ప్రదర్శన ఉత్సహపూరితంగా నడిచాయి.

ఇష్టపడి చదవండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కష్టపడి చదవండి భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని వన్ టౌన్ సిఐసుబ్రమణ్యం తెలిపారు. స్థానిక జీవన్ జ్యోతి పాఠశాలలో గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్యప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

యుటిఎఫ్ బలపరచిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సత్యసాయిజిల్లా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. అధికారపార్టీ అభ్యర్థులు అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని, వేలాది దొంగ ఓట్లను చేర్పించారని విమర్శించారు. అంతేకాకుండా తాయులాలు పంపుతున్నారని ఆరోపించారు. ఇటాంటి పరిస్థితుల్లో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి. నాగేంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు బోధన చేయాల్సిన ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు పరిమితం చేసి సందర్శనల పేరుతో ఒత్తిడికి గురిచేసు న్న విద్యాశాఖ అధికారుల వైఖరికి నిరసనగా మార్చి 10వ తేదీ సాయంత్రం చేపట్టే జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ర్యాలీ, ధర్నా ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్రకార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, హరికృష్ణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మద్దతుగా రైతు సంఘం నాయకులు శ్రీరాములు, సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రమేష్, తదితరులు ప్రచారం నిర్వహించారు. ఓటర్లు తమ ప్రథమ ప్రాధాన్యత ఓటును వీరికి వేయాలని కోరారు.

హిందూపురం : ఈ నెల 13న జరగనున్న శాసన మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిసిసి స్పోక్ పర్సన్ బాలాజీ మనోహర్, నాయకులు యూనూస్, అక్రమ్, ఆయాజ్, రవి, శివశంకర్, మహెబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, సీనియర్ నాయకులు కృష్ణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, హిందూపురం పట్టణ ఎఐటియుసి కార్యదర్శి మారుతి రెడ్డి, పట్టణ నాయకులు నారాయణరెడ్డి, ఆది, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బస్సులను ఆపి..టిప్పర్లను వదిలి..!

కణేకల్లు వద్ద వేదవతి హగిరిపై నిర్మించిన బ్రిడ్జి (హెచ్ఎల్‌సి అక్విడెట్) పాతదై కూలిపోయే ప్రమాదం ఉన్నందున దీనిపై రాకపోకలు సాగిస్తే ప్రమాదమని ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్సుల రాకపోకలను పూర్తిగా ఆపేశారు. బస్సులను అయితే ఆపారు గానీ ఇతర వాహనాలు మాత్రం దీనిపై యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ఓ హెచ్ఎల్‌సి యువ అధికారి అత్యధిక టన్నులు కలిగిన టిప్పర్లు, ఇసుక ట్రాక్టర్లు, మట్టి ట్రాక్టర్లను నిత్యం బ్రిడ్జిపై రాకపోకలు సాగించేందుకు దొడ్డిదారిన అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. భారీగా బరువున్న వాహనాలు బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నా ఆ హెచ్ఎల్‌సి అధికారి అటువైపు కన్నెత్తి చూడరు. సదరు అధికారికి చేయి తడిపితే బ్రిడ్జిపై టిప్పర్ల రాకపోకలకు ఇట్టే అనుమతి ఇచ్చేస్తారన్న విమర్శలు బహిరంగంగానే వ్యక్తం అవుతున్నాయి.



వేదవతి హగరి బ్రిడ్జిపై మట్టితో వెళ్తున్న ట్రాక్టర్

- వేదవతి హగరి బ్రిడ్జి రాకపోకలపై అధికారుల వింత నిర్ణయం
- ప్రమాదం పేరుతో బస్సుల నిలిపివేత
- టిప్పర్లు, ఇసుక ట్రాక్టర్లకు మాత్రం అనుమతులు
- హెచ్ఎల్సీ అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

ప్రజాశక్తి-కణేకల్లు

కనేకల్లు నుంచి అనంతపురం జిల్లా కేంద్రం, ఉరవకొండ, దర్గాహొన్నూరుతో పాటు మండల పరిధిలోని దాదాపు 20 గ్రామాలకు పైగా బస్సులు రాకపోకలు సాగించేందుకు వేదవతి హగిరిపై నిర్మించిన బ్రిడ్జి ప్రధాన రహదారిగా ఉంది. బ్రిడ్జి పాతది అయ్యిందన్న కారణంతో ఇటీవల దీనిపై రాకపోకలను నిషేధించారు. దీంతో ఆ ప్రాంతం మీదుగా వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. కణేకల్ ప్రాంతాల్లోని వివిధ పాఠశాలలకు వచ్చే చిన్నారుల నుంచి ఉరవకొండ డిగ్రీ కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఆ దారి మూసేయడంఒ అవస్థలు పడుతున్నారు. వ్యాపారస్తులు, ఉద్యోగులు, గర్భిణులు, బాలింతలు వద్ధులు కణేకల్‌కు ప్రయాణం చేయాలంటే ఓ పెద్ద సమస్యగా మారింది. దాదాపు 8 నెలలుగా ఈ సమస్య ఆ ప్రాంత ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. బస్సులు రాకపోవడంతో కణేకల్ నుంచి మాల్యం వరకు ఆటో ప్రయాణమే ప్రజలకు దిక్కు అయ్యింది. ఆటో ప్రయాణం కుదరకపోతే కాలినడకన దాదాపు 5 కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. ఉరవకొండ నుంచి కణేకల్ వరకు వచ్చే బస్సులు మాల్యం గ్రామం వరకే వస్తున్నాయి. అక్కడి నుంచి కణేకల్‌కు కుదిరితే ఆటో లేకపోతే కాలినడకన ప్రజలు కనేకల్‌కు రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



వేదవతి హగరి వంతెన

బ్రిడ్జిపై యథేచ్ఛగా టిప్పర్ల రాకపోకలు

బ్రిడ్జిపై బస్సు వస్తే కూలిపోతుందని కుంటి సాకులు చెబుతున్నా హెచ్ఎల్సీ యువ అధికారి ట్రాక్టర్లు, టిప్పర్లు తిరిగేందుకు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. టిప్పర్లు తిరుగుతున్నాయి కదా... బస్సులు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రజలు ఎవరైనా సదరు అధికారిని ప్రశ్నిస్తే బ్రిడ్జి పై బస్సులు తిరిగితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని అందుకే తిప్పడం లేదని సమాధానం ఇస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్ల వారికి మాత్రం ఆ దారి గుండా రాకపోకలు సాగించేందుకు ఎలాంటి అడ్డంకులూ చెప్పకుండా అనుమతులు ఇచ్చేస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షల సమయం మొదలైంది. ఈ పరిస్థితుల్లో కనేకల్‌కు బస్సులు రాకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

అడ్డూఅదుపు లేకుండా ఇసుక తరలింపు

హెచ్ఎల్‌సి పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలి పోతుండడంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. హెచ్ఎల్సీ కింద ఉన్న ఆయకట్ట భూములంతా సాగునీరు లేక బీడుగా పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, బ్రిడ్జి పై నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్లు, ట్రాక్టర్లను తిప్పితున్న వారిని, అందుకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు వస్తే బస్సులు నడుపుతాం

హెచ్ఎల్‌సి అధికారులు బ్రిడ్జి పై బస్సులు నడపడానికి అనుమతిస్తే రాయదుర్గం నుంచి ఉరవకొండ వయా కనేకల్ మీదుగా బస్సులు నడుపుతాం. ప్రజలు చాలామంది ఫోన్ ద్వారా ఈ విషయాన్ని తమ దృష్టికి తెస్తున్నారు. హెచ్ఎల్‌సి అధికారుల అనుమతి లేకపోవడంతో బస్సులను ఆ బ్రిడ్జి మీదుగా రాకపోకలను ఆపేశాం.

సురేష్, రాయదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్.

వాహనాలు తిరగరాదు

హెచ్ఎల్‌సి బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. దీనిపై ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాలు ఏవీ తిరగరాదు. మా శాఖలో సిబ్బంది తక్కువ ఉండడంతో బ్రిడ్జిపై సరైన నిఘా పెట్టలేకపోతున్నాం. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే దానికి మేము బాధ్యులం కాదు.

రమణారెడ్డి, హెచ్ఎల్ సి ఈఈ.

నేడు పశువుల సంత మార్కెట్ వేలం

గుడిబండ : స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారంఉదయం 12 గంటలకు గుడిబండ పశువుల సంత మార్కెట్, కూరగాయల మార్కెట్, బస్టాండ్ దినసరి మార్కెట్, ఐదు కాంప్లెక్స్ గదులకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి, ఇఒఆర్‌డి నాగరాజు తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనువారు ముందుగా తగిన దరవత్తు చెల్లించలని చెప్పారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి : బత్తలపల్లి లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం అర్హత కలిగిన విద్యార్థులు ఏప్రిల్ 4వ తేదీలోగా ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చునని పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీసీ, ఈబీసీ విద్యార్థుల వయస్సు 9 నుంచి 11 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వయస్సు 9 నుంచి 13ఏళ్ల మించి ఉంచకూడదని చెప్పారు. ఈ ఏడాది ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. మొత్తం 80 సీట్లు కేటాయించారన్నారు.

మహిళా కండక్టర్‌కు సన్మానం

కదిరి టౌన్ : ఉత్తమ విధులు నిర్వహించిన కదిరి డిపోలో మహిళా కండక్టర్ లక్ష్మీనరసమ్మను సన్మానించారు. 2022 సంవత్సరములో అత్యున్నత ప్రతిభతో తెలుగు వెలుగు బస్సులలో అత్యధిక ఆదాయం తెచ్చినందున అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్ రెడ్డి తదితరులు లక్ష్మీ నరసమ్మను సన్మానించి ప్రోత్సాహకంగా 500 రూపాయల నగదు అవార్డు, ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు హరి మోహన్, భైరిశెట్టి, ఎన్‌వి. రమణ, రామకృష్ణ, నారాయణస్వామి తదితరులు అభినందించారు. ఈ అవార్డు పంపిణీ కార్యక్రమంలో జోనల్ అధికారులు అజమతుల్లా, హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న కండక్టర్

ఘనంగా తాతయ్య జయంతి ఉత్సవాలు

హిందూపురం : శ్రీ యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ క్షేత్రం కైవారం తాతగారి జయంతి ఉత్సవాలు బుధవారం పట్టణంలోని కెవిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోపూజా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కోన పీఠాధిపతులు చంద్ర స్వామి, ఆర్టీసీ జగదీష్, కృష్ణ, నాగరాజు, మహేష్, రాజప్ప స్వామి, సూర్యనారాయణ రెడ్డి స్వామి, గంగాధరప్ప స్వామి, రామంజప్ప స్వామి, నిమ్మకాయల రాము, సద్గురు యోగి నారాయణ సేవా సమితి ప్రెసిడెంట్ డాక్టర్ రవిశంకర్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ వితరణ

కదిరి టౌన్ : కదిరి బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యార్థం ఆర్‌ఒ వాటర్‌ప్లాంట్‌ను నల్లచెరువుకు చెందిన రిటైర్డ్ టీచర్ గంగన్న జ్ఞాపకార్థం ఆయన తనయుడు బెంగళూరు రియల్టర్ పాలెం సుధాకర్ అందజేశారు. బస్టాండుకు అందజేసిన మంచినీటి శుద్ధి ప్లాంటును ఉద్యోగులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మైనుద్దీన్, బస్టాండ్ కంట్రోలర్ ఉత్తన్న ట్రాఫిక్ సూపర్వైజర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

రహదారిపై మురుగునీరు



రహదారిపై ప్రవహిస్తునత్న మురుగునీరు

ప్రజాశక్తి మడకశిర

మడకశిర నగర పంచాయతీలోని కొత్త మసీదు సమీపంలో ప్రధాన రహదారిపై గత కొద్ది రోజుల నుండి మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో అటు పాదాచారులు, ఇటు వాహనదారులు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. పాత మసీదు నుండికొత్త మసీదుకు వచ్చే రహదారిలో ఓ కల్వర్టు కింద పూడుకు పోయి నెలల గడుస్తోందన్నారు. మున్సిపల్ సిబ్బంది తూతూ మంత్రంగా మున్సిపల్ సిబ్బంది చేయించి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. వారం రోజుల నుండి ఈ రహదారిలో మురుగునీరు ప్రధాన రహదారిపై పొంగి ప్రవహిస్తున్నప్పటికీ కనీసం చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. దీంతో మురుగు నీరు రోడ్డుపైకి వస్తున్నాయని అక్కడ నివాసమున్న ప్రజల సైతం అధికారుల తీరు పట్ల విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ రహదారిలో నిత్యం వందలాది మంది ప్రజలు దేవాలయాలకు వెళుతూ ఉంటారు. పాదాచార్యులు కాలినడకతో వెళుతుంటారు .ఇలాంటి ప్రాంతంలో రహదారులను శుభ్రంగా ఉంచవలసి న అవసరం ఎంతైనా ఉంది. మున్సిపల్ అధికారులు ప్రజల నుండి ముక్కు పిండి పన్నులు వసూలు చేసుకుంటారు కానీ పారిశుధ్యం కానీ, ప్రధాన రహదారులను శుభ్రం చేయడం కానీ చేయడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అధికారులు పాలకవర్గ సభ్యులు నివాసం ఉన్న కాలనీలో తప్ప పారిశుద్ధ్య పనులు, కాలనీల శుభ్రం చేయడం కానీ ఇతర కాలనీలో చేయడం లేదని పలు కాలనీవాసులు పేర్కొంటున్నారు. అమరాపురం బస్టాండ్ నుండి కొత్త మసీదు వరకు వెళ్లే పాత పంచాయతీ కార్యాలయం రహదారి అయితే 15 రోజులకు ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదని విమర్శించారు. కానీ, మురికి కాలువలు తీయడం కాని చేయడం లేదని దీంతో అపరిశుభ్రత మూలంగా దోమల అధికమై తాము ఇళ్లల్లో నివాసం ఉండలేకపోతున్నామని కాలనీలో నివసిస్తున్న ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిద్రమత్తు వీడి ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు నివారించి రహదారుల శుభ్రం చేయించాలని పాదాచారులు వాహనదారులు కోరుతున్నారు.

శ్రీరంగరాజుపల్లిలో ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - హిందూపురం

పరిగి మండలం శ్రీరంగరాజుపల్లిలో వెలసిన హజరత్ సయ్యద్ షేక్ బుడేన్ షా ఖాదరి వలి ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం తెల్లవారు జామున శ్రీ హజరత్ సయ్యదీన బుడేన్ షా ఖాదిరి వలి దర్గా వెల్ఫేర్ ట్రస్టు నిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా గంధోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాక్టర్ రుద్రేష్ జానపద కళాభూషణ కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వహకులు షరీఫ్ మాట్లాడుతు ప్రతి సంవత్సరం గంధం వేడుకలు వైభవంగా నాలుగు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వహకులు బాబు, బుడేన్, షరీఫ్, ఫకీర్లు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

శేషవాహనంపై ఖాద్రీశుడు

ప్రజాశక్తి కదిరి అర్బన్

శేషవాహనంపై ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి తిరువీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శేష వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఉదయం నిత్య పూజలు, ప్రత్యేక అలంకరణ, హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ ఆవరణంలోనికళ్యాణ వేదికపై కళాకారులు పలు రూపాలలో నాట్యాలను ప్రదర్శించారు. ఈ ఉత్సవాలలో పాలక మండలి చైర్మన్ జరిపిటి గోపాలకృష్ణ ఆలయ కార్య నిర్వహణ అధికారి గురుప్రసాద్, కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు , నిరంజన్ రెడ్డి, సూర్యనారాయణలు బందోబస్తు నిర్వహించారు.

నేడు సూర్యప్రభవాహనం : లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం 8వ రోజు సూర్యచంద్రప్రభ వాహనంపై ఖాద్రీశుడు దర్శనమివ్వనున్నారనిప్రధాన అర్చకులు నరసింహ రావు, కుమార్ స్వామీలు తెలిపారు. ఉభయ దారులుగా శ్రీనివాసమూర్తి, భార్య సుగుణమ్మ, కీర్తన లక్ష్మీనారాయణ, దేదీప్య కదిరి వారు హాజరవుతారన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి దారుణహత్య

మడకశిర రూరల్ : మండలం కల్లుమరి గ్రామానికి చెందిన వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప(69) అనే వ్యక్తి హత్య బుధవారం గ్రామంలో కలకలం రేపింది. వ్యవసాయ కూలిగా జీవనం కొనసాగిస్తున్న హనుమంతరాయప్ప హత్యపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్యకు కుటుంబ కలహాలా, లేక ఆర్థిక వ్యవహారాల అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. హనుమంతరాయప్ప కళ్ళల్లో కారం చెల్లి రోకలి బండతో మోది హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

సోమందేపల్లి : మేజర్ గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికుడు దళిత లక్ష్మన్న అనారోగ్యంతో బుధవారం మతి చెందారు. ఆయన కుటుంబానికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గంగాదేవి నరసింహమూర్తి, పంచాయతీ సెక్రెటరీ నాగముని పారిశుద్ధ కార్మికుని మతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం వారి కుటుంబానికి అండగా ఉంటామంటూ తమ వంతు సహాయంగా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు నాగభూషణ, గంగాధర్ పాల్గొన్నారు.

కర్నాటక మద్యం పట్టివేత

గోరంట్ల : మండలంలోని కోరేవాండ్లపల్లి చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులు కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. బాగేపల్లి తాలూకా బొందలపల్లికి చెందిన మురళీకృష్ణ అనే వ్యక్తి ఓమిని కారులో 60 కేసుల మద్యం బాటిల్లు ఓడిసి మండలానికి సరఫరా చేస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నల్లచెరువు : మండల పరిధిలోని బండ్రేపల్లి కి చెందిన వైసిపి సీనియర్ కార్యకర్త చిన్నపరెడ్డి బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కదిరి శాసనసభ్యులు పివి. సిద్ధారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళు లు అర్పించారు. అనంతరం కుటుంబ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, రాజప్ప, తదితర వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

గాండ్లపెంట : మండల కేంద్రంలోని సమీపంలో ఉన్న కోటర్స్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బోరు మోటరుకు విద్యుత్ కనెక్షన ఇవ్వలేదన్నారు. కాలనీలో దాదాపు 40 కుటుంబాలు నివాసం ఉంటున్నామని వాపోయారు. దాదాపు ఒక్క సంవత్సరం నుంచి బోరు మోటర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పలుసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా రేపు, మాపు అని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ట్రాన్స్‌కో ధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదని వేసవికాలం దగ్గర పడుతుండటంతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. తాగునీటి కోస ంవ్యవసాయ బోర్ల వద్దకు వెళుతున్నామని, పశువులకు నీరు లేక అమ్ముకుంటే పరిస్థితులు వస్తున్నాయి ఇలానే ఉంటే వలసలు వెళ్లే పరిస్థితులు వస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని బోరు మోటర్ కరెంటు కనెక్షన్ ఇవ్వాలని తాగునీటి సమస్యలు పరిష్కరించాలని పలువురు కాలనీవాసులు కోరుతున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



హిందూపురంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శైలజ



పెనుకొండలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

హిందూపురం : మహిళలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకెళ్లాలని అదనపు జిల్లా జడ్జి శైలజ మహిళలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తూమకుంట చెక్ పోస్టులో టెక్స్ పోర్ట్ గార్మెంట్స్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎడిజెతో పాటు రాష్ట్ర కుంచిటిగ ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నళిని, పరిశ్రమ ప్రొడక్షన్ మేనేజర్ అనంత గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడిజె మాట్లాడుతూ మహిళలు ఇంటిలో అత్తమామలను గౌరవిస్తూ ఉత్తమ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలను మంచి మార్గంలో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు అనుకుంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. పదవులు ముఖ్యం కాదని వ్యక్తిత్వం ప్రధానమని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నవేరా, పరిశ్రమ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ విజయలక్ష్మి, భక్తవత్సలం అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ ప్రస్తుత తరుణంలో మహిళలు అన్ని రంగాలలో ముందంజలో దూసుకెళ్తున్నారు. బాలికలు చదువులో రాణించాలని అన్ని అవకాశాలను అందిపుచ్చుకొని అత్యున్నత పదవులను అలంకరించి ఉన్నత ప్రమాణాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెనుకొండ : స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ వారి ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.శంకర్‌రావు ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వారోత్సవాలను ఈ నెల 4 నుండి 11వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆంధ్ర ప్రదేశ్ ఎస్‌టి గురుకుల పాఠశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ మహిళల కోసం అనేక చట్టాలు వచ్చాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ మధ్యకాలం లో బాలల పై అఘాయిత్యాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని అరికట్టవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని అన్నారు. 18 సంవత్సరాలలోపు ఆడ పిల్లలకు 21 సంవత్సరాల లోపు మగపిల్లలకు పెళ్ళిళ్ళు చేసినట్లయితే అది బాల్య వివాహం అవుతుందని బాలల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా అలాంటి వివాహాలు చేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎజిపిఎం భాస్కర్ రెడ్డి, న్యాయవాదులు నాగార్జున, బి.శ్రీరాములు, నాగిరెడ్డి, సుబ్రహ్మణ్యం, కోర్టు సిబ్బంది కోన గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని డీఈవో మీనాక్షి తెలిపారు. కొత్తచెరువులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈవో కార్యాలయంలో మహిళా ఉపాధ్యాయులు సిబ్బంది డీఈవోను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు వైద్య సిబ్బంది కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు ఆర్డీటీ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు మానవహారం ఏర్పాటు చేశారు. అదే విధంగా పిఆర్‌డిఎస్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు అక్కడ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌డిఎస్ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఆర్‌డిటి ఎటిఎల్ సుధాకర్, డాక్టర్ రాధా వరలక్ష్మి దివ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చట్టసభలలో మహిళలకు అధిక ప్రాధాన్యతనిచ్చారనివైసిపి జిల్లా అధ్యక్షులు,పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి జయలక్ష్మి, స్థానిక మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలతో కలిసి ఎమ్మెల్యే శంకర నారాయణ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి చట్టసభలలో స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా ఎదిగినప్పుడే మహిళలకు స్వతంత్రం స్వేచ్ఛ ఉంటుందని ఆర్‌డిటి అసిస్టెంట్ డైరెక్టర్ సుజాత పేర్కొన్నారు. మండల పరిధిలోని తాళికెర గ్రామంలో ఆర్‌డిటి ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం నుంచి ఆర్‌డిటి అసిస్టెంట్ డైరెక్టర్ సుజాత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళల కోసం అటు ప్రభుత్వాలు ఇటు స్వచ్ఛంద సంస్థలు అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చాయనానరు. పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాల్లో ఎదగడానికి అవకాశం కల్పిస్తున్నాయన్నారు. వాటిని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఐక్యమత్యంతో పోరాడితే వారికి రావాల్సిన అన్ని సదుపాయాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఎటిఎల్ సావిత్రమ్మ, తాళికెర పంచాయతీ సర్పంచి రంగస్వామి, మోరుబాగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందప్ప, ఆర్డీటీ సిఒలు మల్లికార్జున, తిమ్మరాజు, తిప్పేస్వామి, వివిధ మహిళా సంఘ సభ్యులుచ మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనుకొండ : మహిళల ఆర్థిక స్వాలంబన కోసం స్వయం శక్తి సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దేనని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి అన్నారు. బుధవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పార్థసారథి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా: కేక్ కట్ చేశారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ మహిళలు వంట కోసం కట్టెల పొయ్యిలు వాడుతున్న సందర్భంలో దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్లను అందజేసిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయమ్మ, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రతి ఒక్క మహిళ ఉన్నత విద్యను అభ్యసించి మహిళా హక్కులను మహిళా ప్రాధాన్యతలను తెలుసుకోవాలని అన్నారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ మనోహర్ రెడ్డి, పిహెచ్ఎన్ఎల్ వెంకటసుబ్బమ్మ, సూపర్వైజర్లు రవీంద్ర, నారాయణమ్మ, రత్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పిఎస్ గణేష్, శిరీష, చిట్టెమ్మ, ఝాన్సీ ,రాజశేఖర్, విశ్వసుధ, సుబ్బలక్ష్మి, మధుబాబు, ఎఎన్ఎంలు శ్రీదేవి, గీత, లక్ష్మీదేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మహిళలు ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లో రాణించాలని జిలాన్‌బాషా పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కదిరి పట్టణంలోని తపాల శాఖ కార్యాలయంలో ఈ మహిళా ఉద్యోగులకు పలు వినోద కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిలాన్‌బాషా, కదిరి సబ్ డివిజన్ మహిళా ఉద్యోగులు, మెయిల్ వెర్సెస్ నవీన్, దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : కుటుంబ, సమాజ అభివృద్ధిలో మహిళ పాత్ర కీలకమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం టిడిపి స్థానిక కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, మహిళలకు ఆస్తి హక్కు, 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కుతుందన్నారు. డ్వాక్రా మహిళలు ఈరోజు ఆర్థిక స్వాలంబన సాధిస్తున్నారంటే చంద్రబాబు చలువే అని అన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ వాణి, రాములమ్మ లతో పాటు కౌన్సిలర్లు, మాజీ మహిళా కౌన్సిలర్లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో... మహిళా దినోత్సవాన్ని మెప్మా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, తిప్పన్న, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, సిపిఎం రమాదేవి, మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో... ఆర్టీసీ డిపోలో జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని ఆరు డిపోలలో సమర్థవంతంగా పనిచేస్తున్న మహిళ కండక్టర్లు ఆరుగురిని ఘనంగా సన్మానించారు.

అంధ మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ : మునిసిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో సాయి శ్రీనివాస కళ్యాణ మండపంలో రాష్ట్రస్థాయి అంధుల మహిళలు ఘనంగా మహిళ దినోత్సవం నిర్వహించారు. టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ 100 మంది అంధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, రాష్ట్ర అధ్యక్షులు నాగార్జున, ఉపాధ్యక్షులు సరళ, జిల్లా అధ్యక్షులు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ జబివుల్లా, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతు మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, మానసికంగా ఎదగడానికి దేశంలో ఇంకెక్కడ లేని విధంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి మహిళా సాధికారత, సమగ్రాభివృద్ధికి సిఎం జగన్ తగిన చర్యలు తీసుకున్నారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా కౌన్సిలర్లు, టిపిఆర్ఒ కిష్టప్ప, సిఎంఎం హరినాథ్ రెడ్డి, సిఒలు, తెలుగు తల్లి, భరతమాత పట్టణ సమాఖ్యా లీడర్లు, ఆర్‌పిలు, వివిధ మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. బాలయేసు కళాశాలలో వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి మహిళా అధ్యాపకులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, అధ్యాపకులు శివరామరెడ్డి, తన్వీర్, వేణు, అరుణ, వందన తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ అయిషాను ముస్లీం నగరా అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో వైద్యురాలు చేసిన సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య మహిళా కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మనోజ్, ఉదయ్‌కుమార్, చైతన్య సంస్థ గంగిరెడ్డి, శ్రీనివాసులు, బోయ వెంకటేష్, టైలర్ గంగాధర్, శ్యాంబాబు, చందన్ తదితరులు పాల్గొనానరు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిడిపిఒ రెడ్డిరమణమ్మ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మడకశిరలో మాట్లాడుతున్న పారిశ్రామిక వేత్త జనార్ధనరెడ్డి

పెనుకొండ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తెలుగుదేశం పార్టీ రాష్టకార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ స్వగృహంలో బుధవారం టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు ,గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, అడదాకులపల్లి మాజీ సర్పంచి ప్రసాద్, తోటగేరి సుబ్రహ్మణ్యం, త్రివేంద్ర నాయుడు, అరుణ్ కుమార్ రెడ్డి, బాబుల్ రెడ్డి, మారుతి, వాసుదేవరెడ్డి, బాలాజీ నాయక్ చిన్నపోతన్న, వీరచిన్న తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పద్మావతి మాట్లాడుతూ ఇంటికి ఇల్లాలే దీపమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు శోభారాణి, కార్యదర్శి పుష్పలత, శారద, వరలక్ష్మి, ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, విశ్రాంత ఉద్యోగి హరిప్రసాద్ ,చిన్న రావు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మహిళలు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థ కల్పిస్తున్న రుణ సౌకర్యాలు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళల ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రముఖ పారిశ్రామికవేత్త జనార్దన్ రెడ్డి, ఆర్డీటీ ఎటిఎల్ నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వైబి హళ్లి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీటీ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనకు గ్రామంలోన సమస్యలు వివరించారు. గ్రామంలో రోడ్లు వేయించాలని, అంగన్వాడి భవనాన్ని నిర్మించాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామాంజనేయులు, కెవిపిఎస్ యోగానంద, సిఐ రామాంజనేయులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె, తదితరులు



కదిరిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మహిళా నాయకులు